# వలసపోయిన మందహాసం

నాకు మొలకెత్తిన ఓ సుందరచైతన్యాకృతి
నాకే వీడ్కోలిస్తున్నప్పుడు
ఇన్నాళ్లూ
గుండెగదిలో పొదిగి పొదిగి
కళ్లకేదో మంచుతెరకప్పి
చూస్తూ చూస్తూనే
గువ్వలా ఎగిరిపోయినట్టుంది.
తెలిసి తెలిసి
సైబేరియన్‌పక్షిలా వలసపోయినట్టుంది.
సందడిని, సంబరాన్ని మూటకట్టుకు పోయిందేమో!
ఇంతలోనే మేము మనుషుల మధ్యే లేనట్టుంది.
అనుభవానికొస్తేగాని
ఏ వేదనైనా ఆవేదనైనా అర్థం కాకుండా ఉంది

ఛెంగు ఛెంగున గెంతులు
చిన్నప్పటి గుజ్జెనగూళ్లు
చిలిపి చేష్టలు
ఇల్లంతా నింపిన అలంకరణలై
ఇంటందరికీ గుర్తు చేస్తూనే ఉంది.
ఎగిరిపోయిన ఛాయలెక్కడా లేవు
కనిపించక కలవరం తప్ప
లేకుండా ఉండలేని నిర్లిప్తత తప్ప
నువ్వైనా నేనైనా
మొలకెత్తిన చోటే మొక్కలన్నింటినీ ఉండనీయం
పూచిన పూలనీ పండ్లనీ చెట్టుకే వదిలేయం
ఎంతలేదన్నా కాదన్నా

విడిచిపోలేని బాధ
విడదీస్తున్న చేతులకంటదు.
లేదంటే చూడు
పోగొట్టుకున్న వాడి ముందు గెల్చుకున్న వాడి గర్వంలా
ఆ చేతిలో చెయ్యి
అభయహస్త మవునో కాదో
మందహాసమై మెరుస్తోంది
సరిగ్గా ఒకప్పటి నాలాగే!